


ఆ వీధిలో పెద్ద పెద్ద భవనాలు-ఎత్తైన ప్రహరీ గోడలు. వాటిని ఆనుకుని ఎత్తుగా పెరిగిన అశోక వృక్షాలు ఎంత అందంగా కనులపండువుగా ఉండి మనసును రంజింపజేస్తాయో అంత బాధాకరంగా ఉంటుంది ఆ చిన్న మిద్దెను చూస్తే. రవ్వల హారంలో ఒక రవ్వ రాలిపోతే ఎప్పుడే వెలితి ఆ హారం అందాన్ని ధ్వంసం చేసినట్టుగా ఉందా మిద్దె పరిస్థితి. మామూలు పాంథునకు కూడా 'ఇది ఇక్కడ ఎందుకుంది?' అసహ్యించుకోక పోడు. అన్నీ ఒకనాడు ఇలాంటి మిద్దెలే కాబోలు—మిద్దెలుపోయి అద్భుత మహలులు వెలిశాయి కాబోలు. యీ పడిపోయీ పడిపోని ఈ చిన్న మిద్దె యజమాని అదృష్టరేఖ అతడి గడప దాటలేదు కాబోలును!


ఆ రోజు ఆ గడప దగ్గర ఇద్దరు ముగ్గురు చేరి మాట్లాడుకుంటున్నారు. కనకయ్య మెల్లగా అంటున్నాడు "పెద్దయ్యగార్కి ఒంట్లో బాగాలేదండీ. డాక్టరు గార్ని పిలిస్తే బావుండు"

మిగతా ఇద్దరు లోపలికి రాలేదు. స్కూటర్లెక్కి వెళ్ళిపోయారు. మూడిళ్ళ అవతల ఉన్న అద్దాల మేడలో వసించే డాక్టర్ గార్ని పిల్చుకుని వెంటనే వచ్చారు గోపాల్, టిమ్మూలు. ముగ్గుర్ని చూచి కనకయ్య ఆదరాబాదరా బైటికొచ్చాడు.

ముగ్గుర్నీ లోపలి గదిలోకి తీసుకెళ్ళాడు.

ఆ గది శుభ్రంగా ఉంది. మంచంమీద వృద్ధుడు రాజారావు పడుకునివున్నాడు. డెభ్బైసంవత్సరాలు దాటి ఉండవచ్చును అతడి కళ్ళు తెరుచుకుని ఉన్నాయి. కాని అతడు దేనినీ చూడటంలేదు. డాక్టర్ పరీక్షచేసి కనకయ్యకేసి తిరిగాడు "ప్రాణం ఉంది—ఇప్పుడో అప్పుడో..."

కనకయ్య హృదయంలోంచి ఒక్కపెట్టున 'బాబయ్యా' అన్న పిలుపు ఆ గది వాతావరణాన్ని ఛేదించింది. మరు




క్షణంలో అతడు రాజారావు చేయి పట్టుకుని కూర్చున్నాడు.

"పాపం ఎవ్వరూ లేరు కదూ?"

కనకయ్య జవాబిచ్చే స్థితిలోలేడు. అతడికళ్ళు అవిరామంగా స్రవిస్తున్నాయి పెదాలు అదురుతుంటే ఏదేదో మాట్లాడుతున్నాడు

డాక్టర్‌కు అలాంటి దృశ్యాలు మామూలే. ఒక్కక్షణం పాపం అని బాధపడి వెళ్ళిపోతాడు. రోజూ చూచే ఈ చావు సీన్లు అతడి హృదయాన్ని కలవరపర్చటం మానేశాయి అతడు మాత్రం వెళ్ళిపోలేదు. కుర్చీలో కూర్చుని నాడి చూచాడు. ఎక్కడో సన్నగా కొట్టుకుంటుంది. అది ఉన్నంతవరకే మనిషికి విలువ-ఆ తరువాత!

"కనకయ్యా—ఏదైనా ఉంటే—నీవు ఏదైన సంతకం చేయించుకోవాలంటే ఇదే అవను. నేనుకూడ ఉన్నాను. వ్రేలిముద్ర వేయించుకో..."

కనకయ్య ఏడ్పుమాని చివ్వన తలెత్తి చూచాడు. ఏం లేదన్నట్లు తిరిగి దుఃఖసముద్రంలో మునిగిపోయాడు.

తన సలహా పాటించనందుకే అతడు బాధపడలేదు. చుట్టూ చూచాడు. మిద్దె బయట ఎంత అసహ్యంగా ఉన్నా లోపల మాత్రం చాల చక్కగా ఉంది. పాత కాలం నగిషీపని చేసిన కుర్చీలు మంచం-బీరువాలు పాలిష్‌చేసినట్లు మెరుస్తునాయి. బల్లమీద వెండి చెంబు గ్లాసు ఉన్నాయి. బీరువా తాళాలు బీరువాకే వ్రేలాడుతున్నాయి.

ఈ వృద్ధుడి దగ్గర ఏముంది? ఏమీ ఉండదు. వచ్చే పెన్షన్ డబ్బులు కనకయ్య సహాయంతో ఈ ఇంట్లో జీవిస్తున్నాడు. ధనము, ఆభరణాలు డబ్బు లేక

పోవచ్చును. కాని ఈ ఇల్లు! ఈ ఇంటి ఆవరణం—మంచి సెంటర్‌లో ఉంది.

అతడి బుర్ర అతి చురుకుగా పని చేసింది. అటుఇటు చూచాడు. ఆ కుర్రాళ్ళు వెళ్ళిపోయారు ఎప్పుడో.

కనకయ్యతో అన్నాడు. "కనకయ్యా అందరం ఒక రోజు పోవలసినవాళ్ళమే. వృద్ధులై పోతున్నారు. అంతే చాలు. ఇన్నాళ్ళూ సేవచేశావు. తదనంతరం ఈ ఇల్లువాకిలి-ఆ ఉన్నదేదో అదీ అన్నా ఎవరికి చెందాలో ఏర్పాటు చేశారా? ఇలా అడిగేనని ఏమీ అనుకోకు. కొడుక్కన్నా ఎక్కువ చేశావు. ఆయన చేయకపోతే ఇప్పుడే రాయించేసుకో. మన అవతల ఇంట్లో ప్రహ్లాద్"

అతన్ని పూర్తి చేయనివ్వలేదు కనకయ్య "బాబూ-అయ్యగారు చానాళ్ల క్రితమే విల్లు రాయించినారు."

లోపల మనసు చివుక్కుమన్నా పైకి మాత్రం తృప్తిగా "మంచిది - వస్తా మరి. దాహం తీరటానికి నోరు చప్పరిస్తే చంచాతో ఈ ద్రవంపోస్తూవుండు" అని ఒక సీసా ఇచ్చి లేచాడు. క్షణం ఆ వృద్ధుడి ముఖంకేసి చూచి రెండు చేతులు జోడించి మెల్లగా వెళ్ళిపోయాడు. అతడు ఆలోచిస్తున్నాడు - ఈ గుంటూరులో 'మంచి స్థలం. కనకయ్య ఏం చేసుకుంటాడు మరొకళ్ళు ఆశ చూపించక ముందరే తను కొనెయ్యాలి.'

అతడు బయటికి వచ్చాడో లేదో నాలుగైదు స్కూటర్లు ఆగి ఉన్నాయి. జనం వస్తున్నారన్న మాట- మరికొంత సేపటికి కార్లు వచ్చి ఆగాయి. జనం ప్రోగవుతున్నారు. ఒక్కొక్కరే వెళ్ళి చూచి వస్తున్నారు.

"పాపం - జీవుడు కొట్టుకులాడుతున్నాడు.. ఇంకెంతోసేపు లేదు"

ఆ వీధిలో ఉన్న చిన్నా పెద్దా అంతా వస్తున్నారు. కనకయ్యకు ఆశ్చర్యంగా ఉంది, వీళ్ళంతా ఒక్కోరోజు వచ్చి బెదిరించి తమ ఐశ్వర్య దర్పాలను ప్రదర్శించి రాజారావును ముప్పుతిప్పలు పెట్టి వెళ్ళేవారు.

ఈరోజు ఎంత నమ్రతతో నమస్కరించి వెళుతున్నారు! వీళ్ళంతా తోడేళ్ళు. వీళ్ళ మధ్య నివసించాలి కనుక జాగ్రత్తగా ఉండాలి. కనకయ్య కొన్ని గడియల్లో జరుగబోయే విషాద ఘట్టానికి తయారవుతున్నాడు. రాజారావు చనిపోయాడు. కనకయ్య అతడి కుటుంబం ఒక్కటే మనస్ఫూర్తిగా దుఃఖంతో అన్ని పనులు చేసుకుంటూపోయారు, అంతా సద్దుమణిగింది. పెద్ద దినం కూడ క్లుప్తంగా జరిగిపోయింది. ఇక కనకయ్య ఆ యింటి యజమాని! ఒక నౌకరు తమ మధ్యలో ఉండటమా!

ఆ వీధి ఈ సత్యాన్ని గ్రహించటానికి సిద్ధంగా లేదు. గోపాల్ అతడి బృందం కనకయ్యకు సహాయంచేశారు. రాజారావు ఇంటి ఎడమవైపు అంజయ్య

గారుంటారు. అతడికి లేని ఏజెన్సీలు లేవు. తన ఆవరణం ఇరుకైపోయింది. రాజారావు బ్రతికుండగా ఎన్నోసార్లు ఆ ఇల్లు అమ్మేయమని కోరాడు. బెదిరించాడు. ఇక ఇప్పుడు ఫరవాలేదు. రాజారావు తన ఇంటికి మధ్యనున్న గోడ పడగొట్టించాలి. ఈ రాత్రికి రాత్రి ఆక్రమించుకోవాలి. ఆ స్థలమంతా ఏపుగా పెరిగిన చెట్లతో నిండిఉంది. ఆ గోడ పునాది ఎక్కడో కూడ తెలియదు. ఏపుగా పెరిగిన ఆ చెట్లనీడలో రాలిన ఆకులు కుప్పలు కుప్పలుగా పడి ఉన్నాయి. ఆ గోడ మీదుగానే అంజయ్య వసారా దింపించి గదులు కట్టించాడు ఆ గదులు మరికాస్త పెద్దవిగాచేస్తే ఎన్నో సరుకులు పెట్టించుకోవచ్చును. పైవాళ్ళకు పుట్ట జెబితే క్షణములో అన్నీ సర్దుకుపోతాయి. అయినా రాజారావుకు ఎవ్వరూ లేరు-ఒక నౌకరుకు ఏం హక్కు ఉంది!

కుడిపక్క ఇల్లు ప్రసాదరావు డాక్టర్ కొడుకుది. ఇల్లు పెద్దది కాని కాంపౌండ్ చిన్నది కౌన్సిలర్, పెద్దలాన్, ప్లే గ్రౌండు-పదిమంది వస్తే కార్లు పార్కు చేయటానికి స్థలం కావాలి. ఎంత సేపు? కనకయ్యను బెదిరిస్తే సరి. రేపే ఆ పని చెయ్యాలి.

వెనుకవైపు రవివర్మ ఉన్నాడు. అతడి ఇంటికి వెళ్ళాలంటే రాజారావు ఆవరణంలోంచి వెళ్ళాలి. ఏనాడో రాజారావు ఆ స్థలం తండ్రికి అమ్మాడు. నాల్గు అడుగుల వెడల్పున్న సందులోంచి-అదీ రాజారావు కాంపౌండ్ గోడను అనుకుని ఉన్నవైపునుండి దాదాపు ముప్ఫైగజాలు నడిచి వెళ్తే అతడి ఇల్లు వస్తుంది. బళ్ళు ఓడలై రవివర్మకు బ్రహ్మాండమైన ఇల్లు కట్టించాలనిపించింది. కాని ఆ భవనం చేరటానికి నాల్గుఅడుగుల వెడల్పున్న సందులోంచి వెళ్ళటం ఏం దర్జా-ఆ ఇంటి అందమే పోతుంది. అందుకే ఎప్పుడు రాజారావు చస్తాడా అని ఎదురుచూస్తున్నాడు

రవివర్మ సుపుత్రుడు గోపాల్ పెన్త్ కూడ సరిగా చదివి పాసవలేదు. బళ్ళను ఓడలు చేయటానికి మాత్రం తండ్రికి చేయూతనిచ్చాడు. అఖండమైన ఈ రకం తెలివితేటలుగలవాడు. రవివర్మ ఎప్పుడూ 'టూర్' లోనే ఉంటాడు. 'కోట' లో రాజాలాగా నలుగురు రౌడీలను పెట్టుకుని ఆ ఇంట్లో ఉంటాడు. రాజారావుగారి బ్రహ్మాండమైన వృక్షాలచాటున ఆ ఇంట్లో ఏం జరుగుతుందో మెయిన్ రోడ్‌లో వారికి తెలియదు. ఆ ఇల్లు అలాగే ఉంటుంది. రాజారావు ఇల్లు పడగొట్టించి చక్కటి ఇల్లు కట్టించెయ్యాలి. కనకయ్యను లేవగొట్టటం ఎంతసేపు. నలుగురు స్నేహితులూ, గోపాల్ ఉత్సాహంగా ఉన్నారు. సీసాలు చప్పుడు కాకుండా మారుతున్నాయి బల్లమీద భోజన పదార్థాలను అమర్చుతున్న వెంకన్న ఏదో చప్పుడైతే బయటికి వెళ్ళాడు.

"సార్—ఈ రోజు వుమన్స్ కాలేజి మూడు గంటలకే మూస్తారు. మనం రెండున్నరకే వెళ్దాం."

"ఔను. కొందరున్నారే ఆడపిల్లలు-ఎంత పొగరు! వాళ్ళ పొగరు అణచాలి. దీపావళి సీజనుకదా-బుట్టెడు ఆటంబాంబులతో వాళ్ళను హడలగొట్టాలి."

"బులెట్ మీద జోరుగా వెళ్తూ చెయ్యి పట్టి లాగాలి."

"బూబమ్మ బురఖా తగిలించుకుని తగుల్తూ నడిస్తే సరి."

గోపాల్ పగలబడి నవ్వాడు. గోపాల్ ముఖం అందంగా ఉన్నా దుబ్బుగా పెంచుకున్న జుత్తు, గెడ్డం నల్ల కళ్ళజోడు పెదిమల చివరిదాకా వంగిన మీసంకట్టు, అంటిపెట్టుకున్నట్లున్న షర్టుతో అతడు రౌడీమార్కు చిహ్నంలాగానే ఉంటాడు. అతణ్ణి చూస్తే ఆడపిల్లలకు భయం. కాలేజీ వదలగానే ఆడపిల్లలు గుంపులు గుంపులుగా వెళ్తారు. ఒంటరిగా దొరికి పోతామేమో అన్న భయం వారిని అధైర్యపరుస్తూంటే గోపాల్ ఒంటరిగా దొరికిన ఆడపిల్లను వివిధరీతుల బాధపెట్టి గాని వదలడు. ఎవరు ఎవరికి కంప్లెయింట్ చేస్తారు! వీధినపోయే సగంమంది చూచి ఆనందించి-మన కెందుకులే అని వెళ్ళిపోయేవారే కదా!

ఉన్నట్లుండి గోపాల్ నవ్వటం ఆపుజేశాడు. "ఒరేయ్-ఆ ముసలోడి ఇంటికి అటు ఇటు ఉన్నవాళ్ళు ఆ యింటిమీద కన్నేశారు, కొస్తకొస్త జరిగి మ్రింగేయా లనుకుంటున్నారు. ఈ రాత్రికే మనం నలుగురం వెళ్ళి ఆ కనకయ్యను దారిలోకి తెచ్చుకోవాలి. మనల్ని కాదనే దమ్ము లెవడికున్నాయి."

నౌకరు చకచక లోపలికొచ్చాడు.

"గోపాలయ్యా... ఇది యిన్నారా? మరంట-ఆ ముసలోడు ఆ కొంపను కనకయ్యగాడి కియ్యలేదంట-ఎవుళ్ళో అనాథాశ్రమంకు రాశాడంట"

పిడుగు పడినట్లే అయింది. గోపాల్ ఆశ్చర్యంతో విన్నాడు. క్రోధంతో పళ్ళు నూరుతున్నాడు.

ఆ స్నేహితులు ముఖాలు చూచుకున్నారు. ఆరిలో ఒకడన్నాడు "నీకేం భయం. ఎవరిని ఎట్లా లొంగదీసుకోవాలో మనకు తెలుసు. ఒక్కమాట చెప్పావంటే కనకయ్య కాళ్ళుచేతులు కట్టి తెచ్చి పడేస్తాము. ఆ ఇంట్లోకొచ్చినవాళ్ళని బెదిరించి వెళ్ళిపోయేలా చేయగలం."


గోపాల్ కనుబొమ ముడి వీడింది.

"ఎవరట?"

"ఏమోనయ్యా కనకయ్యా నోరు తెరవటంలేదు."

అంతా గబగబ భోంచేశారు.

"వెయ్యి కళ్ళతో చూస్తుండాలి. అందరం మెలకువతో ఉందాం" ఒకరు మార్చి ఒకరు సందులోంచి వెళ్ళి రాజారావు ఇంట్లోకి చూచి వస్తున్నారు. కాని




అక్కడ ఎవ్వరూ లేరు. ఒక గంట పోయాక టిమ్మీ పరుగెత్తుకుంటూ వచ్చాడు. "అంజయ్య లోపలికెళుతున్నాడు."

ఇద్దరు హడావిడిగా సందు దగ్గర కొచ్చారు. కాని అప్పటికే సందులోంచి ఎవరో వస్తున్నారు. ఆ వస్తోన్న వ్యక్తులని చూసి విస్తుపోయాడు గోపాల్.

ఒక అమ్మాయి. ఆమె వెనుక ఒక పురుషుడు!

గోపాల్ సన్నగా ఈలవేశాడు. స్నేహితుడు గోపాల్ భుజంచుట్టూ చేయివేసి ఒంకరగా నుంచుని పోజుపెట్టాడు.

"గోపాల్...ఎవరా...పిట్ట...మన సంగతి తెలీదులా ఉంది...రానియ్."

గోపాల్ జవాబుగా కన్నుగీటి నిటారుగా నుంచున్నాడు. వాళ్ళు సమీపించారు. ఆ అమ్మాయికి ఉంటే పద్నాలుగు పదిహేను సంవత్సరాలుండవచ్చును. సన్నగా సన్నజాజి మొగ్గలా ఉంది. నలిగిపోయిన పరికిణీ, ఓణి వేసుకుని ఉంది. ఎన్నోరోజులు లంఖణాలు చేసినట్లు ముఖం పీక్కుపోయి కళావిహీనంగా ఉంది.

ఆ పిల్ల అత్యంతాతురతతో వారిని మార్చి మార్చి చూచింది.

"పారిపోయి వచ్చిందిలా ఉంది" గోపాల్ చెవిలో ఊదాడు స్నేహితుడు.

"ఏమండీ రవివర్మగారి ఇల్లు ఇదే కదూ?"

"ఏ రవివర్మ!"

"పి రవివర్మ" ఆత్రంగా అంది.

"ఆ ఇదే ఇల్లు-ఎందుకొచ్చావు?"

గోపాల్ కంఠంలో నిర్లక్ష్యం

"ఐతే ఈ ఇంట్లో గోపాల్ అన్నయ్య ఉంటారట, ఉన్నారా?"

గోపాల్ నిటారుగా నుంచున్నాడు. సగం తనమీద పడుతూ నుంచున్న స్నేహితుడు చటుక్కున పోజు మాని తిన్నగా నుంచున్నాడు.

"ఎవరీ అమ్మాయి? గోపాల్ అన్నయ్య అంటుందే?"

"ఎవరు నువ్వు?" ఆ ఫ్రెండ్ నిర్ల క్ష్యంగా అడిగాడు.

"నాపేరు వినిత అండీ! గోపాల్‌గారు మా అన్నయ్య. ఈ అడ్రస్ ఇచ్చి వెళ్ళ మని చెప్పారు మా వార్డెన్.

గోపాల్ ఆమెచేతిలోంచి అడ్రస్ కాగితాన్ని లాక్కుని చూచాడు. అది తన అడ్రస్. పూర్తిగా కరెక్టుగా ఉంది.

ఉన్నట్లుండి మిగతావారు కూడ వారి ఇద్దరినీ సమీపించారు. ఆ ఐదుగురు ఆ అమ్మాయిని నఖశిఖపర్యంతం పరీక్షగా చూస్తున్నారు. అవతలివాడు ఎవడు? రిక్షావాడా? ఒంటరి ఆడపిల్లల్ని ఎక్కడ ఒదలాలో వాళ్ళకే తెలుసును. ఇలాంటి ఆడపిల్లలు ఏదోవంకన డబ్బు చేసుకో వాలని అన్నయ్యా, బాబాయి అంటూ గౌరవనీయమైన బురఖాలాంటి వరుసలు తగిలించుకుని రావటంలో వారికి వారే సాటి! ఇంత చిన్న వయసులో ఇలా వచ్చిందంటే ఎవర్ని మెచ్చుకోవాలి! వాడినా? ఆ అమ్మాయినా?

"చెప్పరేమండీ-అట్లా చూస్తారేం? అన్నయ్య ఉన్నారా?"

ఆ పిల్ల ఎంతో అమాయకంగా అడు గుతోంది. కెంపుల్లా మెరుస్తోన్న ఆ కళ్ళలో సన్నటి నీటిపొర క్రమ్ము తుండగా మళ్ళీ అడిగింది,

"ఇల్లు మారారా? ఎక్కడున్నారు?"

"ఎవరు నీవు? ఎందుకొచ్చావు? ఒకరడిగారు.

ఆ ప్రశ్నలో ధ్వనించిన కరకు స్వరానికి ఆమె భయపడింది. ఒక్క అడుగు వెనక్కివేసి తనతో వచ్చిన మగ మనిషికి దగ్గరగా వెళ్ళింది.

అతడు విసురుగా ముందుకొచ్చాడు.

"ఆయమ్మ గోపాల్ బాబు ఉన్నాడా అని అడుగుతా ఉంటే మాటాడరేం బాబూ" అతడు ఆ ఐదుగురిని అంచనా వేసి వెనక్కి తిరిగాడు.


"పదమ్మా. ఆయన లేడు-పోదాం పద."

ఆమె జాలిగా చూస్తూ వెనుదిరిగింది, కాని రెప్పపాటులో ఒకడు ఆ పిల్లచేయి పట్టుకున్నాడు. ఆమె సన్నటి సుకుమార మైన మణికట్టు మీద అతడి వ్రేళ్ళు బిగుసుకున్నాయి. ఆతడిపట్టు ఆమెలోని రక్తాన్ని కరుడుగట్టించింది. నోటమాట రాక మూనుపడి నుంచుంది.

అతడు ఈ హఠాత్పరిమాణానికి నిర్ఘాంతపోయాడు, చటుక్కున ఆ అమ్మాయి ప్రక్కకు వచ్చాడు.

ప్రతిపక్షంలో ఐదుగురు - తను ఒక్కడు-ఏం చెయ్యాలి?

మిగతావాళ్ళు పట్టనట్లు కాస్త అవత లకు వెళుతున్నారు. అది వారి 'రాజనీతి,' ఆమెను వాడు పట్టుకున్నాడు, చలగాట మాడే హక్కు వాడికే ఉంది.




ఆమెముఖం వివర్ణమైంది. భయంతో తనతో వచ్చినవాడి వైపు చూచింది. అతడు ఆమెకు దగ్గరగావచ్చి "అమ్మా నేనున్నాను" అన్నాడు మెల్లగా.

టిమ్మ ఆమెను లాగుతున్నాడు. ఆమె గింజుకుంటూ - ఉన్న శక్తినంతా కూడదీసుకుని ఆవేశంతో అంది. "మా గోపాలన్నయ్యకు చెబుతాను...నిన్ను ఏంచేస్తాడో చూచుకో—"

ఆమె అనటం పూర్తిఅయిందో లేదో గోపాల్ చటుక్కున ఆమెను సమీపించి "టిమ్మా ఒదులు" అన్నాడు. టిమ్మ వెంటనే ఒదిలాడు-కాని గోపాల్ వేపు ఆశ్చర్యంతో చూస్తున్నాడు.

ఆమె మాత్రం ఎంతో సంతోషంతో గోపాల్ ను చూస్తోంది.

గోపాల్ ఆమె చేయి అందుకుని ఆమె మణికట్టుకేసి చూస్తూ "కందిపోయిందమ్మా-నొప్పిగా ఉందా?" ఆమె మాత్రం రెప్పవేయకుండా చూస్తూ "మీరు మా గోపాల్ అన్నయ్యేనా?" అడిగింది ఆతురతతో,

"ఔను. నేనే గోపాల్ ని".

"నిజంగా" అంది ఆ నలుగురి వేపు ముఖం చిట్లించి -

"నిజంగానే!"

ఆమె చటుక్కున క్రింద కూర్చుని అంతవరకు అణచిపెట్టుకున్న ఆందోళనను, దుఃఖాన్ని బహిర్గతం చేస్తూ ఒక్కపెట్టున రోదించటం ప్రారంభించింది. గోపాల్ ఆమెదగ్గర క్రింద కూర్చున్నాడు. ఆమెతో వచ్చినవాడు కాస్త దగ్గరగా జరిగి నుంచున్నాడు. వాడి కళ్ళు చెమర్చాయి.

"ఐతే నేను అడగ్గానే ఎందుకు చెప్పలేదన్నయ్యా-నీకోసం వెదుక్కుంటూ

వచ్చానే-ఇట్లా భయపెట్టేశా వెందుకు? గోపాల్ అన్నయ్య నాకున్నాడని చెప్ప గానే ఎంత పొంగిపోయానో తెలుసా?"

గోపాల్‌కు అయోమయంగా ఉంది. ఆ నలుగురూ గోపాల్ ఒకే విధంగా ఆలోచిస్తున్నారు. తన తండ్రికి మరో స్త్రీ ఉందా? ఇది సాధ్యమేనా? ఎందుకు కాకూడదు? టూర్ అంటూ వెళ్ళాడు. ఎన్ని రోజులు రాకుండా ఉంటాడు! నలుగురు స్నేహితులు గుసగుస లాడుకుంటున్నారు.

టిమ్మి మాత్రం పొగరుగా అన్నాడు "గోపాల్ పోలికలు కూడా ఉన్నాయి" వెకిలిగా నవ్వాడు.

గోపాల్ క్రోధంతో "షటప్" అని ముఖం తిప్పేసుకున్నాడు.

"అన్నయ్యా నువ్వు నిజంగా గోపాల్ అన్నయ్యవేనా ?"

"ఔను బాబూ-చెప్పండి" అతడు అన్నాడు.

గోపాల్ వారిద్దర్నీ చూచి నవ్వి లోపలికెళ్ళి తన కార్ లైసెన్సు తెచ్చి చూపించాడు.

వాడు ఆ లైసెన్సును పరీక్షగాచూచి అతడు గోపాల్ అని నిర్ధారణగా తెలుసుకుని అన్నాడు "బాబూ తమని వెంట బెట్టుకుని రమ్మన్నారు వార్డెన్ అమ్మగారు."

"ఔనన్నయ్యో-నిన్ను పిల్చుకుని రమ్మని మా అప్పయ్యను పంపుతుంటే నేనే వెళ్ళి పిల్చుకొస్తానని వచ్చాను, రా పోదాం" అంది.

గోపాల్ లేచి మంచున్నాడు. నలుగురికి జాగ్రత్తలు చెప్పి వాళ్ళిద్దర్నీ తీసుకుని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌కు వెళ్ళాడు. వనిత హుషారుగ పరిగెత్తుకుంటూ వెళ్ళి వాళ్ళ వార్డెన్‌ను పిల్చుకుని వచ్చింది.

ఆమె గోపాల్‌ను చూచి చాల సంతోషించింది. "మీ నాన్నగార్ని కలుసుకుని వచ్చారు ప్లీడర్ రంగనాథ్‌గారు. కొంచెంసేపు కూర్చోండి వారు వస్తుండాలి."

ఆమె వెళ్ళిపోయింది. వినిత పది నిమిషాల తరువాత వచ్చింది. గుడ్డలు మార్చుకుని ముఖం కడుక్కుని కడిగిన ముత్యంలా ముచ్చటగా వచ్చి కూర్చుంది. కాని అంతలో రంగానాథ్ రావటంతో ఆమెను లోపలికి తీసుకెళ్ళిపోయింది ఆయా.

"గోపాల్. మొన్న మీ అమ్మగార్ని కలిశాను. మీ నాన్నగారు రావటానికి పది రోజులు పడ్తుందట. అందుకే నీ సహాయం కోరుతున్నాను. ఇదిగో... ఈ ఉత్తరం చదువు. అంతా తెలుస్తుంది."

గోపాల్ అత్యంతాతురతతో ఉత్తరాన్ని చదవటం ప్రారంభించాడు. క్రింద సంతకం చూచి మానుపడిపోయాడు. తమాయించుకుని చదవటం ప్రారంభించాడు.



"గోపాల్ బాబూ... అనారోగ్యంతో నేను బాధపడ్తున్నప్పుడు ఎంతో ఆదరంగా వచ్చి నాకు కావలసిన మందులు తెచ్చి ప్రేమతో పలుకరించి వెళ్ళేవాడివి. నీపై నా గురి కుదిరింది.

కొన్ని సంవత్సరాల క్రితం నేను రాజమండ్రిలో ఉద్యోగం చేస్తుండగా నా ఒక్కగానొక్క కూతురు గోదావరిలో కొట్టుకునిపోయింది...అని మీకు అంటే లోకానికి తెలుసు. కాని అది నిజం కాదు. ఆమెను ఎవరో ఎత్తుకుపోయారు. వెదికించాముగాని దొరకలేదు మా జీవితాలు నిస్సారంగా, దుర్భరంగా గడిచిపోయాయి. నేను రిటైర్ అవగానే నా ఇంట్లోవచ్చి స్థిరపడిపోయాను; అంతకు క్రితమే కొంతస్థలం మీ నాన్నగారికి అమ్మాను. ఒకరోజు ఎవరో ఒక ఉత్తరం పట్టుకొచ్చారు. అది-నా కూతురు పద్మ రాసిన ఉత్తరం. సంభ్రమాశ్చర్యాలతో కన్నీరు కాలువలు కట్టుతుండగా చదివాను. ఆనాడు ఆమె పడకూడని వారి చేతిలో పడిందట. ఆ తరువాత చేతులు మారి-పోలీస్ రెయిడ్ అయి ఒక పోలీస్ క్లర్క్ దృష్టిలో పడింది. అతడు మంచివాడు. ఆమెను పెళ్ళిచేసుకున్నాడు. ఒకసారి మెడ్రాస్ రమ్మని రాసింది. వెంటనే నేను, నా భార్య వెళ్ళాము. ఉత్తరం తెచ్చిన అతను మా అల్లుడే. ఇద్దరు సంతోషంగా కాపురం చేసుకుంటున్నారు. ఇంటికి, గుంటూరు రమ్మని ఆహ్వానించాను. కాని లోకం చాల చెడ్డది. మానిపోయిన పుండును సూదులతో గుచ్చి

కెలికి బాధిస్తుంది సంఘం. ఆమెను గౌరవంగా బ్రతుకనివ్వదు. వాళ్ళు రాలేదు. మేమే తరచు తీర్థయాత్రలకని చెప్పి వెళ్ళివచ్చేవాళ్ళం. ఆ రోజు మా జీవితాలలో మరో కాళరాత్రి. ఆనాడు గాలివాన భీభత్సంలో చెట్టు కూలి వారున్న చిన్న పెంకుటిల్లుమీద పడి ఇద్దరు చనిపోయారు. వారి కూతురే వినిత. పెళ్ళైన పదకొండేళ్ళకు పుట్టింది. ఐదేళ్ళ పిల్ల. కొమ్మల సందుల్లో సురక్షితంగా ఉంది. నేను తెచ్చి ఆమెను విజయవాడ కాన్వెంట్‌లో పెట్టాను. నా భార్య మరో ఏడాదిలో చనిపోయింది. నాకు అనారోగ్యచిహ్నాలు మొదలవటంతో వినితను తెచ్చి ఇక్కడే కాన్వెంట్‌లో చేర్పించాను. మొన్ననే కాశ్మీర్ టూర్‌కు వెళ్ళారు. వినిత చిన్న పిల్ల. ఒక అన్నయ్యగా నిన్ను పరిచయం చేశాను. ఆ చిన్నతల్లిని పడకూడనివారి బారినుండి రక్షించు. ఆమెకు సోదరుడుగా నిల్చి వివాహమయ్యేవరకు కనకయ్యకు అండగా నిలిస్తే ఈ ఇంటి ఇరువైపుల ఉన్నవారి బారినుండి రక్షింపబడ్తుంది. లేకపోతే వారిరువురు జరుగుతూ వచ్చి వినితకు నిలువ నీడ లేకుండా చేస్తారు. ఒక అమాయక అనాథ అభాగ్యురాల్ని నీ చేతుల్లో పెడ్తున్నాను. నన్ను ఆదరంగా పలుకరించి వెళ్ళేవాడివి. నీపై నాకు సంపూర్ణ విశ్వాసముంది. నీకై నీవు ఈ విషయాలు చెప్పకు. మెల్లిగా అందరికీ తెలుస్తుంది.

— రాజారావు.

తేది: అతడు చనిపోకముందు-నాల్గు రోజులు ముందు రాసినది. గోపాల్ ఆ క్షణంలోనే ఆమెకు అన్నగా ఆదుకోవాలని తీర్మానించుకున్నాడు.

ఇరువైపుల ఉన్నవారికంటే వెనుక వైపు ఉన్న గోపాల్ అతడి రౌడీ బృందమే ఆమె జీవితాన్ని నరకప్రాయం చేస్తారని రాజారావుకు తెలుసును. అందుకే తెలివిగా ఈ ఏర్పాటు చేశాడు.

ఈ నిగూఢ అర్థాన్ని గోపాల్ గ్రహించలేకపోయాడు

